పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు అతివలు దూరం

- ఓటరు నమోదుకు ఆసక్తి చూపని మహిళలు
- రేపే పోలింగ్
- ఏర్పాట్లలో అధికారులు నిమగ్నం

భీమడోలు: పట్టభద్రుల ఓటరు నమోదుకు అతివలు పెద్దగా ఆసక్తిని కనబర్చలేదు. దీనితో పురుష ఓటర్ల కన్నా మహిళల సంఖ్య తక్కువగా నమోదైంది. జనాభా పరంగా, సాధారణ ఎన్నికల్లో ఇప్పటికీ మహిళలదే పైచేయిగా నిలుస్తోంది. అన్నింటా పోటాపోటీగా ఉండే మహిళలు పట్టభద్రుల ఓటర్ల జాబితాలో తక్కువగానే నమోదయ్యారు. పట్టభద్రుల ఓటర్‌గా నమోదు చేసుకునేందుకు వారు ముందుకు రాలేదు.

ఉంగుటూరు నియోజకవర్గంలో ఓటర్ల వివరాలు

ఉంగుటూరు నియోజకవర్గంలో భీమడోలు, గణపవరం, నిడమర్రు, గణపవరం మండలాల్లో 6,068 మంది పట్టభద్రుల ఓటర్లు నమోదయ్యారు. పురుషులు 3,726 మంది, మహిళలు 2,341 మంది ఓటు నమోదు చేసుకున్నారు. ఇతరులు ఒక్కరు ఉన్నారు. పురుషులు 61శాతం, మహిళలు 39 శాతం నమోదయ్యారు. 22 శాతం పురుష ఓటర్లను ఉన్నారు. గత ఎమ్మెల్సీ ఎన్నికల్లో 65 శాతం పోలింగ్ నమోదైంది. ఈ పోలింగ్ శాతం పెంచాలని ఎన్నికల అధికారులు భావిస్తున్నారు. ఈనెల 27వ తేదీ గురువారం ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ నిర్వహించనున్నారు. అందుకు తగ్గట్లు అధికారులు ఏర్పాట్లు చేసారు. ఇప్పటికే బీఎల్వోల ద్వారా ఓటర్ల స్లిప్‌లను పంపిణీ చేస్తున్నారు.

హోరాహోరీగా ప్రచారం

ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో 35 మంది అభ్యర్థులు నిలిచారు. దీనితో బ్యాలెట్ పత్రం భారీగా ఉండనుంది. అయితే వారిలో ప్రధానంగా కూటమి అభ్యర్థి రాజశేఖర్, పీడీఎఫ్ అభ్యర్థి దిడ్ల వీరరాఘవులు, మరో అభ్యర్థి జీవీ సుందర్ తదితరులు విస్తృత ప్రచారం చేసారు. దీనితో గెలుపుపై ఎవరి అంచనాలు వారికి ఉన్నారు. 8 నెలల కాలంలో కూటమి ప్రభుత్వం ఉద్యోగులు, నిరుద్యోగులు, వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులకు చేసిందీ లేకపోవడంతో వారంతా వ్యతిరేకతను చూపుతున్నట్లు సమచారం. వారి ఓట్ల కోసం పార్టీ కేడర్ తీవ్రంగా శ్రమిస్తోంది. ఇప్పటికే సోషల్ మీడియా గ్రూపుల్లో ప్రభుత్వానికి వ్యతిరేకంగా మెసేజీలు పెడుతున్నారు. పీడీఎఫ్, స్వతంత్ర అభ్యర్థులు చాపకింద నీరులా విస్తృత ప్రచారం చేస్తున్నారు. ప్రభుత్వ వ్యతిరేకతను తమకు అనుకూలంగా మార్చుకుని సఫలీకృతమయ్యేందుకు వారు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే ఎన్నికల ప్రచారం ముగిసింది.



భీమడోలు-1 పాఠశాలలో ఏర్పాటు చేసిన రెండు పోలింగ్ బూత్‌లు

నియోజకవర్గంలోని ఓటర్ల వివరాలు

మండలం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం	పోలింగ్ కేంద్రాలు
భీమడోలు	976	634	01	1,611	03
ఉంగుటూరు	1,009	621	నిల్	1,630	03
నిడమర్రు	583	367	నిల్	950	01
గణపవరం	1,158	719	నిల్	1,877	03

పట్టభద్రులూ... ఓటు వేయడం ఇలా

ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల నియోకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు తనకే ప్రాధాన్యత ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థిస్తున్నారు. వాస్తవంగా సాధారణ ఎన్నికలకు ఇవి కాస్త భిన్నంగా ఉంటాయి. పోటీ ఉన్న వారందరికీ ప్రాధాన్యత క్రమంలో ఓటు వేయవచ్చు. ఇదే క్రమంలో ఒకరికి ఇచ్చిన ప్రాధాన్యత మరో అభ్యర్థికి ఇవ్వకూడదు. అయితే పోలింగ్ కేంద్రాల వద్ద వసతుల కల్పనపై సంబంధిత అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. పోలింగ్ బూత్‌ల్లో వెబ్ కెమెరాలను ఏర్పాటు చేశారు.



ఓటర్ స్లిప్‌లను ఇంటింటికీ వెళ్లి అందిస్తున్న బీఎల్వోలు

ఓటు ఇలా వేయాలి

- పోలింగ్ కేంద్రానికి గుర్తింపు పత్రంలో ఓటర్ వెళ్లి అక్కడ ఉన్న అధికారులకు చూపించారు.
- పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్ జాబితాల్లో పేరు, క్రమ సంఖ్య చూసుకోవాలి. ఓటర్ గుర్తింపు పత్రంపై సంతకం చేయాలి. అనంతరం ఓటర్‌కు బ్యాలెట్ పేపర్ ఇస్తారు. ఇందులో అభ్యర్థుల పేర్లు, ఫొటోలుంటాయి. పార్టీ గుర్తులుండవు.
- మొదటి ప్రాధాన్యతం ఇచ్చే వారికి 1 అని నంబర్ వేయాలి. మిగిలిన అభ్యర్థులకు 2, 3 అని ప్రాధాన్యతాక్రమ సంఖ్య వేయవచ్చు. పోలింగ్ కేంద్రంలో ఇచ్చిన పెన్ మాత్రమే వాడాలి.

ఇలా చేయరాదు

- పోటీలో ఉన్న అభ్యర్థులందరికీ ఒకటే నంబర్ ఇవ్వకూడదు. అభ్యర్థికి కేటాయించిన బాక్సులో అంకెలు వేయాలి. బ్యాలెట్ పేపర్‌ను మడత పెట్టకపోతే చెల్లదు. 1వ ప్రాధాన్యం ఇవ్వకుండా మిగిలిన అంకెలు సూచించరాదు.

క్లుప్తంగా

నల్లమారెమ్మకు విశేష పూజలు



నల్లమారెమ్మ తల్లి చిత్రపటం వద్ద నైవేద్యం సమర్పించి, పూజలు చేస్తున్న భక్తులు

భీమడోలు: భీమడోలులో 12 ఏళ్లకొకసారి నిర్వహించే గ్రామదేవతల జాతర ఘనంగా కొనసాగుతోంది. ఈ క్రమంలో గ్రామ దేవతలుగా పూజలందుకుంటున్న మద్దిరావమ్మ, మహాలక్ష్మమ్మ, గంగానమ్మ, పోతురాజు జాతర వైభవంగా నిర్వహించనున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ దత్తాడ శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేసారు. మంగళవారం సాయంత్రం నల్లమారెమ్మకు నైవేద్యం సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయంలో పంబల వారితో రూపొందించిన నల్లమారెమ్మ చిత్రం వద్ద గ్రామస్తులు కుటుంబ సమేతంగా తరలివచ్చి దర్శించుకుని, పూజలు చేసి, మొక్కులు తీర్చుకున్నారు. జాతర కమిటీ సభ్యులు, యువకులు, భక్తులు పాల్గొన్నారు.

కోళ్ల కళేబరాల పూడ్చివేత



కోళ్ల కళేబరాలను జేసీబీతో తొలగిస్తున్న దృశ్యం

భీమడోలు: పోలసానిపల్లి పంచాయతీ శివారు ఆంజనేయనగరం పోలవరం కాలువ గట్టుపై గుర్తు తెలియని వ్యక్తులు వదిలివెళ్లిన కోళ్ల కళేబరాలను మంగళవారం జేసీబీ సాయంతో సేకరించి గోతుల్లో పూడ్చారు. కొందరు వ్యక్తులు నిర్లక్ష్యంగా కాలువ గట్టు, నీటిలో కోళ్ల కళేబరాలను వదిలి వెళ్లడంతో పరిసర ప్రాంతాలు దుర్గంధం వ్యాపించడంతో సర్పంచ్ షేక్ రహీమాబేగం హసేనా, పంచాయతీ కార్యదర్శి యు.జయరామకృష్ణ తక్షణమే స్పందించారు. పంచాయతీ సిబ్బంది పీపీఈ కిట్లు ధరించిన సిబ్బంది కాలువలో దిగి కోళ్ల కళేబరాలను జేసీబీ సాయంతో ట్రాక్టర్‌లో వేసి దూరంగా తీసిన గోతుల్లో పూడ్చి వేశారు. ఆయా ప్రాంతాల్లో బ్లీచింగ్ చల్లారు.

ఆర్థిక సాయం అందజేత

ఉంగుటూరు: ఎముకకు సంబంధించిన క్యాన్సర్‌తో బాధపడుతున్న నారాయణపురానికి చెందిన మోహన్ సాత్విక్‌కు రూ.13 వేలు ఆర్థిక సాయాన్ని మానవత మండల శాఖ అధ్యక్షుడు వేగేశ్న రంగరాజు అందించారు. మంగళవారం నారాయణపురంలో సాత్విక్ ఇంటికి వెళ్లి వారు ఈ ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మానవత విస్తరణ కమిటీ రాష్ట్ర కన్వీనర్ సాగిరాజు జానకి రామరాజు, రీజియన్ చైర్మన్ పుప్పాల గోపి, మండల కన్వీనర్ అడపా శ్రీనివాస్, కార్యదర్శి గంజి రవి, పుసులూరి ప్రకాష్, బండారు నాగరాజు, నేదూరి గంగాధర్ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన అవసరం



గణపవరంలో విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై మణికుమార్

గణపవరం: ఇటీవల విపరీతంగా పెరిగిపోయిన సైబర్ నేరాలపై విద్యార్థినీ విద్యార్థులంతా అప్రమత్తంగా ఉండాలని గణపవరం ఎస్సై మణికుమార్ అన్నారు. మంగళవారం గణపవరం బాలికోన్నత పాఠశాల, పిప్పర జెడ్పీ ఉన్నత పాఠశాలలో సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వీడియో క్లిప్పింగ్‌లు వేసి సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సెల్‌ఫోన్ వాడకం తగ్గించాలని, అనవసరంగా వచ్చే లింకులు, యాప్‌లను ఓపెన్ చేయవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై మణికుమార్, ఏఎస్సై ఎం.వరలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఇష్టంతో చదవాలి

నిడమర్రు: పదో తరగతి పరీక్షల పట్ల భయం వీడి, ధైర్యంగా ఉండాలని, కష్టపడి చదవడం కన్నా ఇష్టపడి చదివితేనే మంచి ఫలితాలు సాధించవచ్చునని నిడమర్రు ఎంఈవో భాస్కరకుమార్ అన్నారు. మంగళవారం చానమిల్లి ఉన్నత పాఠశాల పదోతరగతి విద్యార్థులు నిర్వహించిన ఫేర్‌వెల్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. హెచ్‌ఎం యర్రంశెట్టి శేషగిరిరావు మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈఏడాది పదోతరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్, అదనపు క్లాసులు, వీక్లీ టెస్టులు నిర్వహించామని తెలిపారు. ఉపాధ్యాయులు బి.దంజు, భీమాల వరప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినుల నృత్యాలు, సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

వ్యాన్ డ్రైవర్‌కు గాయాలు

ఉంగుటూరు: జాతీయరహదారిపై తాడేపల్లిగూడెం వైపు నుంచి ఏలూరు వెళుతున్న వ్యాను వేగంగా వస్తూ అదుపుతప్పి కాలువగట్టుపై ఉన్న చెట్లమధ్యకు దూసుకుపోయింది. మంగళవారం జరిగిన ఈ ప్రమాదంలో వ్యాను డ్రైవరు ఎస్‌కే ఇర్ఫాన్‌కి గాయాలయ్యాయి. 108 వాహనంలో తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రికి అతడిని తరలించారు. కునుకుపాటు కారణంగా ఈ ప్రమాదం జరిగిందని ఆయన తెలిపారు.

బలివేలో పారిశుధ్య పనులు



వంతెన వద్ద పారిశుధ్య పనులు పర్యవేక్షిస్తున్న పర్యవేక్షణాధికారి కృష్ణంరాజు తదితరులు

పెదవేగి : పూర్తిస్థాయిలో పారిశుధ్య పనులు ఏర్పాటుచేసి పర్యవేక్షిస్తున్నామని జిల్లా పారిశుధ్య పర్యవేక్షణాధికారి కృష్ణంరాజు అన్నారు. ఉమ్మడి కృష్ణ పశ్చిమగోదావరి జిల్లాలో మధ్యలోఉన్న బలివే గ్రామంలోని భలేరామల లింగేశ్వరస్వామి ఉత్సవాలు బుధవారం ప్రారంభంకానున్న నేపథ్యంలో జిల్లా పారిశుధ్య పర్యవేక్షణ అధికారి కృష్ణంరాజు పెదవేగి మండలం ఎంపీడీవో, ఈవోపీఆర్డీ, ఉత్సవాల వద్ద పారిశుధ్య పర్యవేక్షణ పనులను పరిశీలించారు. ఉత్సవాలు విజయవంతం కావడానికి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని వారు పేర్కొన్నారు.

ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రాల పరిశీలన

భీమడోలు: ఈనెల 27న గురువారం ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎన్నికల ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని చర్యలు చేపట్టామని మండల తహసీల్దార్ బి.రమాదేవి, ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి అన్నారు. భీమడోలు-1, పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మూడు పోలింగ్ బూత్‌లను వారు మంగళవారం సందర్శించారు. అక్కడ ఏర్పాట్లను వారు పరిశీలించారు. వీఆర్వోలకు పలు సూచనలందించారు. పోలింగ్ బూత్‌లోని ఐదుగురు అధికారులకు వసతులను సమకూర్చాలని సూచించారు. మండలంలోని పట్టభద్రుల ఓటర్లంతా భీమడోలు మండల కేంద్రంలోనే ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. మండలంలో పురుషులు 976, మహిళలు 634, ఇతరులు ఒక్కరు తమ ఓటు హక్కును వినియోగించుకుంటారన్నారు. ఏఎస్సై చలపతిరావు, గ్రామకార్యదర్శి కేవీఎం తనూజ, కార్యదర్శి ఎం.హేమసుందర్, వీఆర్వోలు వినయ్, ప్రతాప్ పాల్గొన్నారు.

ముగిసిన జ్ఞాన జ్యోతి శిక్షణ



జ్ఞాన జ్యోతి శిక్షణ ముగింపులో సర్టిఫికెట్లు అందజేసిన ఎంపీడీవో రాజ్‌మనోజ్

ఉంగుటూరు: అంగన్‌వాడీ కార్యకర్తలు చిన్నారులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దాలని ఎంపీడీవో రాజ్‌మనోజ్ అన్నారు. మంగళవారం ఉంగుటూరు హైస్కూల్లో అంగన్‌వాడీ కార్యకర్తలకు నిర్వహించిన జ్ఞానజ్యోతి శిక్షణ ముగింపు కార్యక్రమానికి ఎంపీడీవో హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతో ఎన్నో వ్యయప్రయాసలతో ఈ జ్ఞాన జ్యోతి శిక్షణను ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. ఆటపాటలతో అక్షరాలు, అంకెలను చిన్నారులకు నేర్పాలన్నారు. అనంతరం అంగన్‌వాడీ కార్యకర్తలకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, హెచ్‌ఎం మీరాకుమారి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలు బలోపేతం

భీమడోలు: జ్ఞానజ్యోతి శిక్షణ తరగతుల వల్ల అంగన్‌వాడీ కేంద్రాలు బలోపేతమవుతాయని భీమడోలు ఐసీడీఎస్ ఇన్‌చార్జి సీడీపీవో షాహనాజ్ బేగం అన్నారు. శిక్షణలో నేర్చుకున్న విజ్ఞానాన్ని చిన్నారుల సమగ్రాభివృద్ధికి దోహదపడేలా బోధన చేయాలని అంగన్‌వాడీ కార్యకర్తలకు ఆమె సూచించారు. భీమడోలు జెడ్పీ ఉన్నత పాఠశాలలో జ్ఞాన జ్యోతి కార్యక్రమంలో రెండో దఫా మూడు రోజుల శిక్షణ తరగతులు మంగళవారంతో ముగిసాయి. పలు అంశాలపై డీఆర్‌పీలు ఎం.శరీన్, గోపాలకృష్ణ శిక్షణ అందించారు. అనంతరం అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ సర్టిఫికెట్లును అందించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ ఇన్‌చార్జి సీడీపీవో షాహనాజ్, కోర్సు డైరెక్టర్ బి.శ్రీనివాసరావు, సూపర్‌వైజర్లు నూర్జహాన్, ఎం.కవిత, సీఆర్‌పీలు రాధాకృష్ణ, సత్యకృష్ణ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పంచాయతన క్షేత్రం ముస్తాబు



మండలపర్రులోని ఉమా నీలకంఠేశ్వరస్వామి



విద్యుత్ వెలుగుల్లో మండలపర్రులో పంచాయతన క్షేత్రం

నిడమర్రు: మండలపర్రులోని ఉమా నీలకంఠేశ్వర స్వామి పంచాయతన క్షేత్రంలో మహా శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆలయం వద్ద నిర్వాహకులు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయ గోపురాలను విద్యుద్దీపాలతో అలంకరించారు. ఆలయ ప్రాంగణాన్ని మొక్కలతో సుందరీకరించారు. ఆలయ గోడలపై దేశంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రాల పెయింటింగ్స్‌తో తీర్చిదిద్దారు. బుధవారం తెల్లవారుజాము నుంచి గురువారం వేకువజాము వరకూ ఆలయంలో ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు. ఆరోజు ఉదయం 4 గంటలకు స్వామివారికి ఏకాదశ రుద్రాభిషేకంతో పూజలు ప్రారంభించి, సహస్ర కుంకుమార్చన, రుద్ర హోమం నిర్వహిస్తారన్నారు. టీటీడీ పాలక మండలి మాజీ సభ్యుడు గాదిరాజు వెంకటసుబ్బరాజు దంపతులు ఆధ్వర్యంలో శివపార్వతుల కల్యాణాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యుడు సరిపల్లె శకరం తెలిపారు. లింగోద్భవ సమయంలో ఏకాదశ రుద్రాభిషేకానికి అన్నాభిషేకం ఏర్పాట్లు చేసామన్నారు. ఉదయం 10 గంటల నుంచి ఆలయ ప్రాంగణంలో భక్తులకు భారీ స్థాయిలో అన్న సమారాధన నిర్వహిస్తామన్నారు.

ప్రసాదం పంపిణీకి ఏర్పాట్లు పూర్తి

దెందులూరు: శివరాత్రి పర్వదినం సందర్భంగా బుధవారం గాలాయగూడెంలో అచ్చమ్మ పేరంటాలు తల్లి ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. గాలాయగూడెం బస్టాండ్ సెంటర్ ఎదుట ప్రత్యేక ఏర్పాట్లు వేశారు. ఏలూరు నుంచి గాలాయగూడెం రోడ్డు వైపు వెళ్లే భక్తులకు ప్రసాదం అందిస్తామని అచ్చమ్మ పేరంటాలు తల్లి ఆలయ కమిటీ సభ్యులు మంగళవారం వివరించారు.



ఉంగుటూరు భీమేశ్వరస్వామి ఆలయం



ఉంగుటూరులో స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

వైభవంగా భీమేశ్వరుని కల్యాణం

ఉంగుటూరు: స్థానిక భీమేశ్వరస్వామి ఆలయంలో కల్యాణం మంగళవారం రాత్రి నిర్వహించారు. పార్వతీ భీమేశ్వరస్వామి కల్యాణం డప్పువాయిద్యాలు నడుమ నిర్వహించారు. శివరాత్రి సందర్భంగా ప్రత్యేక ఏర్పాట్లను ఆలయ ఈవో శ్రీనివాసరావు, ఉత్సవ కమిటీ చైర్మన్ నారాయణం హనుమంతురావు పర్యవేక్షిస్తున్నారు.

నేటి నుంచి మేధా దక్షిణామూర్తి ఉత్సవాలు

దెందులూరు: జిల్లాలోనే ప్రసిద్ధి చెందిన దెందులూరు మండలంలోని అత్యంత పురాతనమైన దక్షిణ చిన్న కాశీగా పేరుపొందిన చింతలపూడిలో వెలసిన మేధా దక్షిణామూర్తి స్వామి ఆలయంలో ఉత్సవాలను బుధవారం నుంచి మార్చి 2వ తేదీ వరకు వైభవంగా నిర్వహిస్తున్నామని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. 26న తెల్లవారుజామున పంచామృతాలతో శివునికి అభిషేకం చేసి ఏకాదశి సందర్భంగా రుద్రాభిషేకాలు, రుద్ర హోమాలు నిర్వహించి ఉత్సవాలను ప్రారంభిస్తామని ఆదివారం విజయభారతి నాట్యమండలి వారితో అల్లూరి సీతారామరాజు నాటక ప్రదర్శన ఉంటుందన్నారు. అనంతరం 27న భీమవరానికి చెందిన స్వర్ణ సుధా ఆర్కెస్ట్రా వారి సినీ మ్యూజికల్ నైట్, 28న సూర్య ఆర్గనైజర్ ఆధ్వర్యంలో డ్యాన్స్ బేబీ డ్యాన్స్, మార్చి 1న తణుకు సూర్య బోయ్స్ వారితో డ్యాన్స్ ఈవెంట్, మార్చి 2న ఏలూరు వారితో సుప్రీమ్ ఆర్కెస్ట్రా సినీ మ్యూజికల్ నైట్ నిర్వహిస్తామన్నారు. అదే రోజు స్వామి వారి ఆలయ సమీపంలో భారీ అన్నసమారాధన నిర్వహిస్తున్నామన్నారు. ఈ ఉత్సవాలకు అందరి సహాయ సహకారాలు అవసరమని ఆలయ కమిటీ సభ్యులు కోరారు. ఈ మేధా దక్షిణామూర్తి స్వామి ఉత్సవాలను ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ప్రారంభిస్తారని, ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. వేలాదిమంది మేధా దక్షిణామూర్తిని దర్శించుకోనున్న నేపథ్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు చల్ల చింతలపూడి శివాలయ కమిటీ సభ్యులు తెలిపారు.



చల్లచింతలపూడిలోని మేధా దక్షిణామూర్తి ఉత్సవ విగ్రహం

మాలలను అణగదొక్కడమే చంద్రబాబు లక్ష్యం

గణపవరం: మాలలను అణగ దొక్కడమే లక్ష్యంగా సీఎం చంద్రబాబు పని చేస్తున్నారని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు అన్నారు. మంగళవారం పిప్పరలో మాలమహానాడు మండల సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా రాష్ట్రంలోని మాలలందరినీ ఆందోళనకు సమాయత్తం చేయాలని, ఈ విషయాలపై వారిలో చైతన్యం కలిగించాలని నేతలకు సూచించారు. సూపర్ సిక్స్ పేరుతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వాటిని గాలికి వదిలేసి కక్షపూరిత రాజకీయాలతో కాలం వెళ్లదీస్తోందని, తల్లికి వందనం, ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన తదితర పథకాలను అటకెక్కించిన ప్రభుత్వం విద్యార్థులను చదువులకు దూరం చేస్తోందని విమర్శించారు. ఈనెల 27న ఆచంటలో నిర్వహించే మాలమహానాడు సమావేశంలో జిల్లాలోని నాయకులంతా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సబ్బితి రాజు, వెన్నపండు, వి.సునీల్ తదితరులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసిన మంగరాజు తదితరులు

బలివే వంతెన.. వైఎస్సార్‌సీపీ హయాంలో సాకారం

- తీరిన రెండు జిల్లాల ప్రజల చిరకాల వాంఛ
- రూ.18.33 కోట్లతో నిర్మాణం
- వైఎస్ జగన్, అబ్బయ్యచౌదరికి జననీరాజనాలు



సిద్ధమైన బలివే వంతెన



బలివే వంతెన నిర్మాణ పనులకు సంబంధించిన మ్యాప్‌ను పరిశీలిస్తున్న అబ్బయ్యచౌదరి (ఫైల్)



తమ్మిలేరు గట్టుపై నిర్మించిన స్నానఘట్టం

పెదవేగి : దక్షిణ కాశీగా ప్రసిద్ధిగాంచిన బలివే క్షేత్రానికి వంతెన నిర్మించి 25 గ్రామాల ప్రజల కష్టాలు తీర్చిన ఘనత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరికే దక్కిందని ప్రజలు అడుగడుగునా హర్షం వ్యక్తం చేస్తూ నీరజనాలు పలుకుతున్నారు. ఎంతో వ్యయప్రాయాసలతో వంతెన నిర్మాణం చేపట్టి అది పూర్తయ్యేందుకు అబ్బయ్యచౌదరి చేసిన అవిరళ కృషిని ప్రజలంతా మరచిపోలేదు.

కూటమి నేతల అసత్య ప్రచారం

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో చేసిన అభివృద్ధిని సైతం కూటమి నేతలు తామే ఇదంతా చేశామని సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేయడం స్థానికంగా చర్చనీయాంశమై విమర్శలకు తావిస్తోంది. కూటమి నేతల తీరుపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

శరవేగంగా నిర్మాణం పూర్తి

రెండు జిల్లాల ప్రజల చిరకాలకోరికను వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తీర్చారని, మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ఆధ్వర్యంలో అది సఫలీకృతమైందని స్థానిక ప్రజలు ముక్తకంఠంతో చెబుతున్నారు. పెదవేగి మండలం విజయరాయి శివారు ప్రఖ్యాతిగాంచిన బలివే వంతెన దశాబ్దాల కలను సాకారం చేస్తూ, రూ.18.33కోట్ల నిధులతో శరవేగంగా నిర్మాణం ప్రారంభించి, పనులు పూర్తి చేయగలిగామని మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు.

ప్రయాణానికి యాతన తప్పింది



బలివేకి వంతెన లేక ఏళ్ల నాటి నుంచి స్కూల్‌కి వెళ్లే విద్యార్థుల దగ్గర నుంచి, వ్యాపారులు, ప్రజలు నరకయాతన అనుభవించారు. దాదాపు 25గ్రామాల ప్రజల జీవితాలు మారతాయని, దెందులూరు, నూజివీడు నియోజకవర్గాల ప్రజల చిరకాల వాంఛ తమ్మిలేరుపై వంతెన నిర్మాణ ఘనత జగన్, అబ్బయ్యచౌదరికే దక్కింది. దీన్నికూడా కూటమి నేతలు వారి ఖాతాలో వేసుకుని ప్రచారం చేస్తున్నారు. – మట్టా శంకర్, విజయరాయి


సుందరంగా స్నాన ఘట్టాలు



2023 డిసెంబర్ సిద్ధం సభలో స్వయానా అప్పటి ముఖ్యమంత్రి వైఎస్సార్ జగన్ మోహన్, అప్పటి ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి ప్రత్యేక చొరవతో ఫిబ్రవరిలో ప్రారంభించి నాలుగు నెలల్లో దాదాపు పూర్తిచేయించారు. ఏలూరు, కృష్ణా జిల్లాలనుంచి బలివే భక్తులు స్నానఘట్టాలులేక చాలా యాతనపడేవారు. నేడు సుందరంగా స్నానఘట్టాలు సిద్ధమయ్యాయి.

– జానంపేట బాబు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్, పెదవేగి

బ్రిడ్జి నిర్మాణంతో ఎంతో మేలు



అబ్బయ్యచౌదరి ఎమ్మెల్యే అయిన తరువాత సమీప ప్రాంత గ్రామాలకు ఈ బ్రిడ్జి నిర్మాణంతో ఎంతో మేలు జరిగింది. వర్షాలు అధికంగా కురిసిన సమయంలో అప్పుడు తమ్మిలేరు తాత్కాలికంగా వేసిన వంతెన కొట్టుకుపోయేది. ఏరుకు ఇరువైపులా ఉన్న ప్రజలకు రాకపోకలకు 15 నుంచి 20 రోజులు పట్టేది. చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయేలా వంతెన నిర్మించారు. – లేగల శివ,ఉప సర్పంచ్, విజయరాయి

ప్రజల చిరకాల వాంఛ నెరవేరింది



రెండు జిల్లాల ప్రజల చిరకాల వాంఛ అయిన బలివే వంతెనను నిర్మించి చరిత్రాత్మక ఘట్టానికి శ్రీకారం చుట్టిన నేత కొఠారు అబ్బయ్యచౌదరి. ఎంతో మంది ఎమ్మెల్యేలు దెందులూరు నియోజకవర్గంలో గెలిచారు. కాని ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, పరిష్కరించలేదు. వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, అబ్బయ్యచౌదరి పేర్లు ప్రజల మనస్సుల్లో తరతరాలుగా నిలుస్తాయి.

– రెడ్డెం శ్రీనివాసరెడ్డి, విజయరాయి

శిక్షణ శిబిరాలతో పనితీరు మెరుగు



శిక్షణ పూర్తిచేసిన అంగన్‌వాడీలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎంఈవో బాలయ్య

గణపవరం: శిక్షణ కార్యక్రమాలు మన పనితీరును మరింత మెరుగు పరుస్తాయని, శిక్షణలో నేర్చుకున్న అంశాలను బోధనలో వినియోగిస్తే, మంచి ఫలితాలు ఉంటాయని గణపవరం ఎంఈవో గొర్రెల బాలయ్య అన్నారు. మంగళవారం గణపవరం బాలికోన్నత పాఠశాలలో ఆరురోజుల పాటు నిర్వహించిన ఎఫ్‌ఎల్‌ఎన్ సర్టిఫికెట్ కోర్సు శిక్షణ కార్యక్రమం ముగింపు సభ నిర్వహించారు. ఈసందర్భంగా శిక్షణ పూర్తి చేసుకున్న ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పి.తులసి, జి.చంద్రావతి, సీహెచ్ దుర్గాభవాని, డీఆర్‌పీలు అపర్ణ, ఎం.పెద్దిరాజు, జీవీఎన్ రాజు పాల్గొన్నారు.